క్లుప్తంగా

బీసీజీ టీకాతో క్షయ నివారణ



బీసీజీ టీకా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పూసపాటిరేగ: బీసీజీ టీకాతో క్షయవ్యాధిని తరిమి కొట్టవచ్చునని వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బీసీజీ టీకా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధి గ్రస్తులు, 60 సంవత్సరాలు నిండిన వారు, సుగర్ వ్యాధి ఉన్న వ్యక్తులు, ధూమపానం అలవాటు ఉన్నవారు, తక్కువ బరువున్న వారు, గతంలో టీబీ వచ్చి తగ్గిన వారు తప్పనిసరిగా బీసీజీ టీకా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్‌వర్మ, ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీని నివారిద్దాం..



పూసపాటిరేగలో అవగాహన ర్యాలీ

పూసపాటిరేగ: సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారిద్దామని మండల వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఇంటి లోపల, ఇంటి బయట ఉన్న నీటి నిల్వలను తొలగించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రమీలాదేవి, సిబ్బంది వేదమణి, మహేశ్వరి, ఆర్‌వీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గజపతినగరం: పురిటిపెంట గ్రామం, మూరుతీనగర్ కాలనీలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే గజపతినగరం, పురిటిపెంట గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని సాయిబాబాకు అభిషేకాలు, పూజలు చేశారు.

ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న మన నేస్తం సంస్థ సభ్యులు

వేపాడ: మండల కేంద్రం వేపాడకు చెందిన లావేటి అప్పారావు 15 రోజుల క్రితం చెట్టుపై నుంచి జారి పడిపోవడంతో గాయాల పాలయ్యాడు. వైద్య ఖర్చుల నిమిత్తం వేపాడకు చెందిన మన నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. బాధితుడికి స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం నగదు అందజేశారు. దాతలకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

బాడంగి: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్మీడియట్ చదివేందుకు స్థానిక ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి ఓ ప్రకటనలో గురువారం కోరారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంతో పాటు ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, వాటిల్లో మొత్తం 160 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు తొలి విడత ప్రవేశాలు జరుగుతాయని, విద్యార్థులు త్వరగా కళాశాలను సంప్రదించి, ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సంబరాలు

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఎల్లమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి అమ్మవారికి మనువు చెల్లించారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో కోరాడ కుటుంబీకుల ఇలవేల్పు సత్తెమ్మ సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ప్రాంతాల్లోని తదితర ప్రాంతాల్లోని కోరాడ వంశీకులంతా ఈ వేడుకలకు హాజరై, అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

తరుగుతున్న చెత్త కొండలు..



గుణుపూరుపేట డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

- డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త తొలగింపు
- బయో మైనింగ్ పద్ధతిలో 2.06 లక్షల టన్నుల చెత్తకు కలగనున్న మోక్షం
- చెత్తను తరలించేందుకు రూ. 15 కోట్లకు పైగా వ్యయంతో ఒప్పందం
- పరిసర ప్రాంత ప్రజలకు ఉపశమనం

విజయనగరం: నగరంలో సేకరించిన చెత్తను తరలించే గుణుపూరు డంపింగ్‌యార్డ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. లక్షల టన్నుల్లో పేరుకుపోయిన చెత్త కొండలను బయో మైనింగ్ పద్ధతిలో తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సేకరించిన చెత్తను ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుల్లో వేయడం వల్ల కొండల్లా పేరుకుపోయింది. డంపింగ్ యార్డులన్నీ నగరానికి శివారున ఉండడంతో ఆ ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి దుర్వాసన తప్పడం లేదు. ముఖ్యంగా గాలి ఎక్కువగా వీచినా, వర్షాలు పడినా నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దుర్వాసన వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా, వారు తీసుకున్న తాత్కాలిక చర్యల వల్ల శాశ్వత పరిష్కారం లభించలేదు. ఈ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా అమృత్ పథకం కింద కొనసాగుతున్న డంపింగ్ యార్డుల్లో నిల్వ ఉన్న చెత్తకొండలకు మోక్షం కలిగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రెండేళ్ల కిందట ఆయా డంపింగ్ యార్డుల్లో సర్వే చేపట్టింది. ఇటీవల 15వ ఆర్థిక సంఘ నిధులతో టెండర్లు కూడా పిలిచింది. చెత్త తొలగింపునకు స్థానిక సంస్థల నిధులు 40శాతం, రాష్ట్ర నిధులు 22 శాతం, కేంద్ర ప్రభుత్వం 38 శాతం నిధులను వెచ్చిస్తోంది.

చర్యలు చేపడుతున్నాం..

గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్లు ఖరారు కావడంతో పాటు పనులు జరుగుతున్నాయి. 2.25 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ పద్ధతిలో తొలగించే చర్యలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. 50 డివిజన్‌లలో విస్తరించిన విజయనగరంలో ప్రతిరోజూ 120 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. నగరంలో సేకరించిన చెత్తను ప్రతిరోజూ 9 కిలోమీటర్ల దూరంలో డెంకాడ మండలం గుణుపూరుపేట సమీపాన గల డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. ఇలా కొన్నేళ్లుగా తరలించిన చెత్త అధికారిక లెక్కల ప్రకారం 22 ఎకరాల విస్తీర్ణంలో 2.25 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని అంచనా. ఈ చెత్తను బయోమైనింగ్ పద్ధతిలో తరలించేందుకు గుంటూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ టెండర్ దక్కించుకుంది. ఈ పనులకు సుమారు రూ.15 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేయగా.... టన్నుకు 740 రూపాయలు చెల్లించనున్నారు.

ప్రజలకు ఉపశమనం..

డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తతో గుణుపూరుపేట, కొత్తముంగినాపల్లి, ముంగినాపల్లి, డి.కొల్లాం గ్రామాలకు చెందిన వారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితమై రోగాల బారిన పడుతున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్వరలో వారి కష్టాలకు మోక్షం కలగనుంది.

అంతర పంటలతో అదనపు ఆదాయం



పతివాడలో కొబ్బరిసాగులో అంతర పంటగా వేసిన అరటిసాగు

- అన్నదాతలకు ఆర్థిక భరోసా

పూసపాటిరేగ: ఉద్యానవన సాగులో అంతర పంటలు వేయడంతో ఉద్యానవన రైతులు అదనపు లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలోని తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అత్యధికంగా కొబ్బరి సాగవుతోంది. వాటిలో అంతరపంటలుగా అరటి, జామి, కోకో మొదలగు పంటలు వేసి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. అంతర పంటల వల్ల ఎకరాకు సుమారు రూ.50 వేల నుంచి 70 వేల రూపాయల వరకు లాభం వస్తోందని రైతులు చెబుతున్నారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సుమారు పది వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఇందులో సుమారు 6500 ఎకరాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు. ఆయా మండలాల్లోని తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, కొణతాలపాలెం, కృష్ణాపురం, చౌడువాడ, రోలుచప్పిడి, చినపతివాడ, పెదపతివాడ, రాయుడుపేట, కోనయ్యపాలెం, ముక్కాం, చేపలుకంచేరు, దిబ్బలపాలెం, గూడపువలస, తదితర గ్రామాల్లో కొబ్బరితోటల్లో అరటి, జామి, కోకో, కూరగాయలు సాగు చేస్తున్నారు.

తెగుళ్ల నివారణ..

కొబ్బరిలో అంతరపంటలు వేయడం వల్ల కొబ్బరి పంటకు ఆశించే కొన్ని రకాల తెగుళ్లను నివారించవచ్చు. అలాగే భూమి కూడా సారవంతమై అధిక దిగుబడులు వస్తాయి.

– జ్యోత్స్న, ఉద్యానవన శాఖాధికారి

లాభాలు ఆర్జిస్తున్నాం..

కొబ్బరిసాగులో అరటి వేయడంతో లాభాలు ఆర్జిస్తున్నాం. ఒకే భూమిలో రెండు రకాలు సాగులు ఏక కాలంలో జరగడం వల్ల గిట్టుబాటవుతోంది. పి. రామునాయుడు, రైతు, పతివాడ

19న నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల పలు ప్రాంతాలకు ఈనెల 19న తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరానికి నీటి సరఫరా చేసే ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి నగరంలోని కంటోన్మెంట్ రిజర్వాయర్ వరకు ఏర్పడిన పైప్‌లైన్ లీకులను ఈనెల 18న బాగు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరుచటి రోజు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 46వ డివిజన్‌లో కణపాక, కేఎల్‌పురం ప్రాంతాల్లో.. 47వ డివిజన్‌లో గంజిపేట, కాంబోయివీధి, బాలాజీ మార్కెట్ రోడ్. 41వ వార్డులో సంజీవరావ్‌కాలనీ, గొల్లవీధి పార్క్‌రోడ్ ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా 25వ డివిజన్‌లో రైల్వే స్టేషన్ రోడ్.. 33వ డివిజన్‌లో బాలాజీనగర్.. 32వ డివిజన్‌లో తోటపాలెం, సిద్ధార్థనగర్.. 34వ డివిజన్‌లో ప్రదీప్‌నగర్.. 18వ డివిజన్‌లో పుత్సలవీధి, హుకుంపేట.. 19వ డివిజన్‌లో లంకాపట్నం.. 20వ డివిజన్‌లో తూర్పుబలిజివీధి, పడమట బలిజివీధి ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. 21వ డివిజన్‌లో నాగవంశంవీధి, కొత్తదేవర వీధి.. 23వ డివిజన్‌లో బొండాడవీధి, ఉల్లివీధి, 17వ డివిజన్‌లో సంతపేట, గొల్లవీధి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వర్షంతో ఉపశమనం



డెంకాడ: పినతాడివాడలో కురుస్తున్న వర్షం

డెంకాడ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఉపశమనం లభించినట్టైంది. కొద్ది రోజులుగా ఎండలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితుల్లో వర్షం పడడంతో ప్రజలు ఎండల నుంచి ఊరట చెందారు.

చల్లబడిన వాతావరణం.

నెల్లిమర్ల రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వేకువజాము నుంచి సుమారు గంటన్నర పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నెల్లిమర్ల మండలంలో 2.2 మిల్లీ మీటర్లు.. భోగాపురంలో 5.4 మిల్లీ మీటర్లు.. డెంకాడలో 4.4 మిల్లీ మీటర్లు.. పూసపాటిరేగలో 3.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గడిచిన కొన్ని రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో అవస్థలు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస, గూడెపువలస, దల్లిపేట, ముగడపేట, చాకివలస, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మస్తాన్ వలీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 304 మంది విద్యార్థులకు గాను 284 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 300 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ ఉషారాణి, విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు



గుర్ల: వైకుంఠపాళి, క్యారమ్ బోర్డు గేమ్ ఆడుతున్న చిన్నారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు, చిన్నారులంతా సద్వినియోగం చేసుకోవాలని గరివిడి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరి యన్ ఎం.ఉషారాణి సూచించారు. గరివి డి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యా యుడు కె.పాపారావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 7 వరకు విజ్ఞాన శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఈశిబిరంలో విద్యార్థులు, చిన్నారులకు రోజూ చిత్రలేఖనం, పుస్తకపఠనం, స్టోరీ టెల్లింగ్, పేపర్ క్రాఫ్ట్, హ్యాండ్ రైటింగ్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామని, క్విజ్, తదితర పోటీ లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుర్లలో..

గుర్ల: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ రామారావు సూచించారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయంలో కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, పుస్తకపఠనంపై అవగాహన కల్పించనున్నామని చెప్పారు. వైకుంఠపాళి, చదరంగం, క్యారమ్ బోర్డు ఇతర ఆటల పరికరాలు అందుబాటులో ఉన్నాయని, చిన్నారులు ఆటలు కూడా ఆడుకోవచ్చని తెలిపారు. ఈశిబిరం 24 రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయం



జామి: జామిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి



బొండపల్లి: బొండపల్లిలో వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది



గంట్యాడ: పెదవేమలిలో వృద్ధురాలికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



మెరకముడిదాం: మెరకముడిదాం సచివాలయంలో వృద్ధుడికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది



వేపాడ: వల్లంపూడిలో వయోజనులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



గజపతినగరం: గజపతినగరంలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

జామి: క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా వయోజనులందరికీ బీసీజీ (బాసిల్లస్- కాల్మెట్ -గురిన్) వ్యాక్సిన్ వేస్తు న్నామని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రా జ్యలక్ష్మి తెలిపారు. జామి పీహె చ్‌సీ పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో 650 మంది వయో జనులకు తొలిరోజు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి చెప్పారు. జామి మండల కేంద్రం లోని కొత్తల వారి వీధి రామాలయం వద్ద చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అయిదేళ్లుగా టీబీతో బాధపడుతూ చికిత్స పొందిన రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని, ప్రతీ గురువారం ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సూపర్‌వైజర్లు, ఏఎస్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

టీకా తప్పనిసరి

బొండపల్లి: క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వయోజనులు, దూమపానం చేసే వారు తప్పనిసరిగా బీసీజీ టీకాలు వేసుకోవాలని బొండపల్లి పీహెచ్ సీ వైద్యాధికారులు సత్యనారాయణ, ఎస్.సమీర అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 60 ఏళ్లు పైబడిన 700 మందిని గుర్తించి, వారందరికీ గురువారం బీసీజీ టీకాలు వేశామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజ్‌గోపాల్, ఎస్.ఏ. భాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

490 మందికి వ్యాక్సినేషన్

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఏడు సచివాలయాల్లో 490 మందికి గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేశామని వైద్యాధికారి అజిత్‌బాబు తెలిపారు. వైద్యాధికారి అజిత్‌బాబు మాట్లాడుతూ 2025 నాటికి క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. 18 ఏళ్ల పైబడినవారికి, టీబీ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, దూమపామనం చేసేవారికి, 60 ఏళ్లు పైబడిన వారికి, బీఎంఐ తగ్గిన వారికి వ్యాక్సిన్ వేస్తున్నామని తెలి పారు. పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరంలో...

గజపతినగరం: క్షయ నివారణే లక్ష్యంగా 18ఏళ్లు దాటిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామని డాక్టర్ పుష్పాంజలి తెలిపారు. గజపతినగరం,పురిటిపెంట వెల్‌నెస్ సెంటర్లలో గురువారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్త సూర్య, నరసయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ మండలంలో...

గంట్యాడ: మండలంలోని పలు విలేజ్ క్లినిక్‌లలో బీసీజీ వ్యాక్సినేషన్ గురువారం ప్రారంభమైంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, మందులు వాడి క్షయ వ్యాధి తగ్గిన వారికి, దూమపానం చేసే వారికి ముందుగా ఈ వ్యాక్సిన్ వేస్తున్నారు.

వేపాడ మండలంలో...

వేపాడ: మండలంలోని బొద్దాం పీహెచ్‌సీ పరిధిలోని కొండగండుబూడి పంచాయతీ మధుర గ్రామం పాతఊరులో, వేపాడ పీహెచ్‌సీ పరిధి వల్లంపూడి, సింగరాయి గ్రామాల్లో వైద్యాధికారులు రమాదేవీ,శివానీ, ధరణి ఆధ్వర్యంలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 59 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అవంతి కళాశాల అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నెల్లూరు శ్రీసిటీకి చెందిన ఏసీ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు ఈ-పాక్, డైకిన్ ఆధ్వర్యంలో గరివిడి అవంతి సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలలోని అన్ని విభాగాల డిప్లమా విద్యార్థులు 107 మంది రాత పరీక్ష, ఇంటర్వ్యూ లకు హాజరు కాగా, 59 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, కళాశాల ఏఓ అనిల్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్, ఈ-పాక్, డైకిన్ కంపెనీల హెచ్‌ఆర్ బృందం జి.చిట్టిబాబు,డి.ఆర్.ఎం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి పైడితల్లి అమ్మవారి పండగ

మెరకముడిదాం: మండలంలోని ఇప్పలవలసలో గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను ఈనెల 19, 20, 21వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. వందేళ్ల క్రితం పండగ నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. పండగ నేపథ్యంలో మూడు రోజులూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నామని, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.